



ప్రజా జ్యోతి
ప్రతిఅక్షరం - ప్రజల కోసం

వరంగల్
శనివారం 26 అక్టోబర్ 2024
హన్మకొండ-భూపాలపల్లి-ములుగు-మహబూబాబద్-జనగాం

# పోలీసులే నిందితులైతే..



**వరంగల్**

ఉమ్మడి వరంగల్ జిల్లా పోలీసులు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారారు. ఏకంగా పోలీస్ ఇన్స్‌పెక్టర్ పైనే పొక్సో కేసు నమోదు కావడం సంచలనంగా మారింది. ఇప్పుడే కాదు.. గతంలోనూ జిల్లాలో పనిచేసిన కొందరు అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది చేసే తప్పుడు పనుల కారణంగా.. మొత్తం డిపార్ట్‌మెంట్‌కు చెడ్డపేరు వస్తోందని పోలీసులే చర్చించుకుంటున్నారు. కేవలం ఈ ఒక్క ఏడాదిలోనే 5 ఘటనలు జరిగాయి.

1.వరంగల్ నగరంలోని ఓ అపార్ట్‌మెంట్లో నివసిస్తున్న పోలీస్ ఇన్స్పెక్టర్ రవికుమార్.. అదే ప్రాంతంలో ఉంటున్న ఓ బాలికపై కన్నేశాడు. అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. గమనించిన బాలిక.. తప్పించుకుని తల్లికి విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కాజీపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు

2.కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్సై అనిల్.. మరో ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని వేధించాడు. ఆ ఉద్యోగిని భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

3.జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో పనిచేస్తున్న సీఐ సంపత్.. కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురుపైనా అత్యాచారం చేయడంతో.. పోలీసులు కేసు నమోదు చేశారు.

4.గతేడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్, మహిళ ఎస్సైతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త ఫిర్యాదుతో విచారణ చేసిన అధికారులు.. ఇన్‌స్పెక్టర్, ఎస్సై ఇద్దరిని సస్పెండ్ చేశారు.

5.పోలీసు శాఖలోని వేరే విభాగంలో పనిచేస్తున్న ఓ సీఐ.. చింతగట్టు సమీపంలో గెస్ట్ హౌజ్‌లో మహిళతో ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో -

మిగతా3లో



# మేజిస్ట్రేట్ హోదాలో సీవీ ఆనంద్ వార్నింగ్

**వరంగల్**

హైదరాబాద్ మహానగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ కొత్వాల్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. అదనపు జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో కార్యనిర్వాహక న్యాయస్థాన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అందజేసిన సమాచారంపై సమీక్షించారు. ఇటీవల నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ ప్రత్యర్థుల మధ్య జరిగిన ఉద్రిక్తతను సమీక్షించారు.నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యే మహ్మద్ మజీద్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ ఫిరోజ్ ఖాన్ మధ్య తీవ్రమైన రాజకీయ వైరం నెలకొంది. ఈ రెండు నేతల రాజకీయ వ్యత్యాసాలు మరియు అనుచరుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంతో నియోజకవర్గంలో శాంతి భద్రతలు తరచూ ప్రశ్నార్థకంగా మారాయి.కొద్ది రోజుల క్రితం మహ్మద్ మజీద్ హుస్సేన్ తన అనుచరులతో కలిసి ఫిరోజ్ గాంధీ నగర్‌లో సిసి రోడ్డుకు సంబంధించిన సివిల్ పనులను పరిశీలించేందుకు వెళ్లారు. అదే సమయంలో, కాంగ్రెస్ పార్టీకి చెందిన మహ్మద్ ఫిరోజ్ ఖాన్ కూడా తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. ఇద్దరు నాయకుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఇరువర్గాల అనుచరులు పరస్పర విరుద్ధంగా వ్యవహరించడం వలన ఆ ప్రాంతంలో ప్రజలలో భయాందోళనలు ఏర్పడ్డాయి, మరియు అక్కడి శాంతి భద్రతలు భంగం కలిగించాయి.ఆ ప్రాంతంలోని పరిస్థితులు తీవ్రతరమవుతుండగా, హుమాయున్ నగర్ పోలీసులు ఇరువర్గాల కార్యకర్తలను చెదరగొట్టేందుకు దాడి చేశారు. శాంతి భద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకున్నారు. ఇరువర్గాలపై చట్టప్రకారం కేసు నమోదు చేశారు.ఈ సంఘటనపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు హుమాయున్ నగర్ ఎస్‌హెచ్‌వో సమర్పించిన సమాచారాన్ని సమీక్షించారు.

## ప్రక్షాళన పేరుతో విహారయాత్రలా....

**హైదరాబాద్ :** మూసీ ప్రక్షాళన తెలంగాణ రాజకీయాల్లో రచ్చకు దారితీసిన అంశం. దీనిపై అపోజిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. అధికార పార్టీ లీడర్లు మాత్రం అదే మూసీ సుందరీకరణ కోసం అధ్యయనమంటూ విదేశీ పర్యటనలు చేస్తున్నారు. ఇది ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. అనుమానాలు.. అభ్యంతరాలపై క్లారిటీ ఇచ్చే ప్రయత్నం వదిలేసి.. పవర్లో ఉన్న పార్టీ లీడర్లు స్టడీ టూర్కు వెళ్లడం ఏంటంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి.మూసీ ప్రక్షాళనకు నిర్ణయం తీసుకునే ముందే సీఎం రేవంత్ రెడ్డి సౌత్ కొరియా వెళ్లి..హన్ నదిని పరిశీలించి వచ్చారు. ఆ తర్వాతే..మూసీ ప్రక్షాళన కోసం చర్యలు చేపట్టారు. డీపీఆర్ కోసం ఓ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. అంతలోపు మూసీ పరివాహక ప్రాంతంలో సర్వేలు, మార్కింగ్చేసే ప్రాసెస్ జరుగుతోంది. మూసీ పరివాహక ప్రాంతవాసుల్లో ఉంటున్న జనాలను ఒప్పించి మరో చోటకు తరలించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఇలా ఓ వైపు అంతా పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతూ ఉంటే.. సడెన్ గా ఇప్పుడు మంత్రులు, వలస ఎమ్మెల్యేలు, కొందరు అధికారులు హన్ నదిపై అధ్యయనం కోసం దక్షిణ కొరియాకు వెళ్లడం ఎందుకనే చర్చ సాగుతోంది.స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి సియోల్ వెళ్లి, హాన్ నదిని చూసి, మూసీ ప్రక్షాళను ఏం చేయాలో డిసైడ్ అయ్యాక.. ఇప్పుడు మళ్లీ ఇద్దరు మంత్రులు, వలస ఎమ్మెల్యేలు వెళ్లి హాన్ నదిని చూసి మాత్రం చేసేదేముందన్న సందేహం కలుగుతోందట చాలా మందిలో. ఎందుకంటే మూసీ పునరుజ్జీవంపై సందేహాలు ఉన్నది ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ

## పోలీసులే నిందితులైతే...

-మొదటిపేజీ తరువాయి

పోలీసులు అక్కడికి వెళ్లేసరికి మహిళను తప్పించాడు. పోలీసులు దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఇలా పోలీసు శాఖలోనే వరుస ఘటనలు వెలుగు చూస్తుండడంతో.. సామాన్యులు పోలీస్ స్టేషన్లకు వచ్చి ఫిర్యాదులు చేసేందుకు భయపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు. ఇటు తాజా ఘటనను పోలీస్ శాఖ సీరియస్గా తీసుకున్నట్టు తెలుస్తోంది. కఠిన చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉందని ఏసీపీ స్థాయి అధికారి చెప్పారు.

# కేటీఆర్ నోటీసులతో జవాబులు

**హైదరాబాద్ :** నేను ఎవరినైనా అనొచ్చు.. కానీ నన్నెవరూ అనొద్దు.. మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా ఇదేనా. అంటే ప్రత్యర్థుల నుంచి అవునన్న సమాధానమే వస్తోంది. ఎందుకంటే గతంలో కేటీఆర్ చాలా సార్లు నోరు జారారు. మొన్నటికి మొన్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు వేసుకోవాలన్నారు. మహిళా కమిషన్ ఆగ్రహానికి గురయ్యారు. విచారణకూ హాజరై వివరణ ఇచ్చుకున్నారు. అంతకు ముందు అసెంబ్లీ సమావేశాల్లో సీఎంను ఏకవచనంతోనూ పిలిచి ఆ తర్వాత మాటలు వెనక్కు తీసుకున్నారుకొత్తగా తనపై విమర్శలు చేసేవారిపై లీగల్ నోటీసులు సంధిస్తున్నారు. ప్రతి విమర్శలకు 'నోటి'ని కాకుండా నోటీసులనే నమ్ముకుంటున్నారు. అంతకు ముందు మంత్రి కొండా సురేఖ విషయంలోనూ అదే చేశారు. తాజాగా కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన కామెంట్లపైనా లీగల్ నోటీసులనే నమ్ముకున్నారు. వారంలో క్షమాపణ చెప్పకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవంటూ కౌంటర్ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు.రాజకీయం అన్నాక విమర్శలు ప్రతివిమర్శలు కామన్. అంత మాత్రాన లీగల్ నోటీసులతో నోరు మూయిస్తానంటే ఎవరైనా బెదురుతారా? అందుకే బండి సంజయ్ కూడా కౌంటర్ నోటీసులు ఇస్తానంటున్నారు. ఇంతకీ కేటీఆర్ లీగల్ నోటీసులతో రాజకీయ అపరిపక్వత బయటపెట్టుకుంటున్నారా? దీనిపై రాజకీయ విశ్లేషకులు ఏమంటున్నారో చూద్దాం.బండి సంజయ్ చదువుకున్నది లేదు. ఎప్పుడైనా పరీక్షలు రాశాడా? ఆయనకు తెలిసిందేమీ లేదు. చెప్పినా అర్థం కూడా కాదు. పేపర్ లీకులే ఆయనకు తెలుసు" గ్రూప్ వన్ అభ్యర్థులకు మద్దతుగా కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన ఆందోళనకు కౌంటర్ ఇస్తూ కేటీఆర్ చేసిన కామెంట్లు ఇవి. సో మొదట వ్యక్తిగతంగా కామెంట్స్ చేసింది కేటీఆర్. ఆయన ఉన్నది ప్రతిపక్షంలో. అవతల ఉన్న నాయకుడు కేంద్రంలో అధికార పక్షంలో ఉన్నారు. పైగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి. ఊరుకుంటారా.. ఇష్యూ పర్సనల్ దాకా వెళ్లడంతో ఊగిపోయారు. అంతే పర్సనల్ గా కేటీఆర్ పై కామెంట్లు చేశారు. ఇంకా ఎక్కువ మాట్లాడితే చీకటి జీవితం బయటపెడుతానని ఘాటు వార్నింగ్ కూడా ఇచ్చారుసో పర్సనల్ అటాకింగ్స్ తో ఇద్దరి మధ్య రాజకీయం వేడెక్కింది. మాటకు మాట, సవాల్ కు ప్రతిసవాల్ జరిగిపోయాయి. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి డైలాగ్ లు విసురుకోవడం, విమర్శలు చేసుకోవడం ఈ రోజుల్లో కామన్ అయ్యాయి. ఎలా చూసుకున్నా ఇష్యూ అక్కడికి ఆగిపోవాలి. కానీ అక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. సీన్ కట్ చేస్తే కేటీఆర్.. కేంద్రమంత్రి బండి సంజయ్ కు లీగల్ నోటీసులు పంపారు. తన పరువుకు భంగం కలిగించేలా బండి సంజయ్ మాట్లాడారని నోటీసుల్లో కేటీఆర్ పేర్కొన్నారు. డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, రేవంత్ తో కలిసిపోయానన్న వ్యాఖ్యలను నిరూపించాలన్నారు. వారం రోజుల్లోగా తనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని.. లేదంటే న్యాయపరమైన చర్యలు తప్పవని బండి సంజయ్‌ను కేటీఆర్ హెచ్చరించారు.అంతకు ముందు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన కామెంట్స్ పై పరువు నష్టం దావా కూడా వేశారు కేటీఆర్. వంద కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేశారు. తనను ఎవరైనా విమర్శస్తే ఇక ఊరుకునేది లేదని?, కోర్టుకు ఈడుస్తానని, చట్టం ముందు నిలబెడుతానంటూ వరుసగా లీగల్ నోటీసులు పంపే పని పెట్టుకున్నారు కేటీఆర్. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి లీగల్ నోటీసులు ఇస్తే ప్రతిగా మరిన్ని నోటీసులు ఇచ్చేందుకు ప్రత్యర్థులు రెడీగా ఉంటారు. ఎవరైనా బెదురుతారా? కామెంట్లు చేసేటప్పుడే ఇవన్నీ చూసుకోవాలని గుర్తు చేస్తున్నారు.ఇదంతా రాజకీయ అపరిపక్వతే అన్న పాయింట్ తెరపైకి వస్తోంది. పాలిటిక్స్ లోకి వచ్చి ఇన్నేళ్లయినా.. రాజకీయాలు వంటబట్టలేదా అన్న టాక్ నడుస్తోంది. పొలిటికల్ విమర్శలన్నిటికీ లీగల్ నోటీసులు ఇచ్చుకుంటూ వెళ్తే ఇక అదే పనిలో కేటీఆర్ ఉండాల్సిందే అన్న చర్చ కూడా నడుస్తోంది. ఎందుకంటే నువ్వొకటంటే.. నే రెండంటా అన్నట్లుంది ఇప్పటి రాజకీయం. పైగా రాజకీయాల్లో భాష కూడా రోజురోజుకూ దిగజారిపోతోంది. అన్ పార్లమెంటరీ పదాలు పెద్ద ఎత్తున వాడుతున్నారు. ఇలాంటి సమయంలో లీగల్ నోటీసులు పని చేస్తాయా.. అన్నది హాట్ డిబేట్ గా మారింది.లీగల్ నోటీసులతో నోరు మూయించే ప్రయత్నాలు చేస్తే ప్రత్యర్థులు సైలెంట్ గా ఉంటారని కేటీఆర్ ఆలోచన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కానీ ఈ కథ చాలా దూరం వెళుతుంది. రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలా లీగల్ నోటీసులు ఇస్తున్నారా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పుడు కేంద్రమంత్రి బండి సంజయ్ కి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. నెక్స్ట్ ఏం జరుగుతుంది? సింపుల్ గా కౌంటర్ నోటీసులు పంపే అవకాశం ప్రత్యర్థి నేతకూ ఉంటుంది కదా. ఇప్పుడు బండి సంజయ్ కూడా చేస్తున్నది అదే. తనను మొదట వ్యక్తిగతంగా అంటేనే తాను పర్సనల్ కౌంటర్ ఇచ్చానని కేటీఆర్ కు గుర్తు చేస్తున్నారు. నోటీసుకు నోటీసుతోనే బదులిస్తానంటున్నారు. లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరంటున్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోందన్నారు. కేటీఆర్ సుద్దపూస కాదని, ఆయన బాగోతం అంతా ప్రజలకు తెలుసన్నారు కేంద్రమంత్రి. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారం లో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో అందరికీ తెలుసు అని, ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చానని ఇక లీగల్ నోటీసులకు నోటీసులతోనే జవాబిస్తానని కాచుకోవాలంటూ సవాల్ చేశారు. ఈ లీగల్ నోటీస్ వార్ కాస్తా ఇప్పుడు మరో లెవెల్ కు వెళ్లింది.ఎవరి పరువుకు ఎలా భంగం కలిగింది.. ఏ ఆరోపణలు చేశారు.. వాటికి ఆధారాలు ఉన్నాయా.. ఇలాంటి వాటి చుట్టూ ఇప్పుడు రాజకీయం తిరగడం ఖాయమే. మ్యాటర్ కాస్తా లీగల్ గా మారడంతో ఒకరిపై మరొకరి విమర్శలను డీకోడ్ చేసే సీన్ వస్తుంది. అయితే ఈ మొత్తం ఎపిసోడ్ లో లీగల్ నోటీసులు పంపడం ద్వారా మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయంగా ఎలాంటి వ్యూహంతో వెళ్తున్నారన్నది హాట్ టాపిక్ గా మారుతోంది. జనరల్ గా చేసుకున్న విమర్శలకు నోటీసులు ఇవ్వడం అంటే రాజకీయ అపరిపక్వతేనా అన్న చర్చ కూడా జరుగుతోంది. నిజానికి ఇలాంటి నోటీసులు ఇస్తే.. ఎవరి లీగల్ పాయింట్లు వారికి ఉంటాయి. అవన్నీ బయటకు తీస్తారు. చట్టపరంగానే ఎవరి కౌంటర్ వారు ఇచ్చుకుంటారు. సో తెలంగాణలో ఎన్నికలకు ఇంకా చాలా టైం ఉంది. ఇలాగే లీగల్ నోటీసులు అంటే అప్పటిదాకా ఇంకెన్ని ఇవ్వాల్సి ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది.బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలపై కేటీఆర్ చేసిన కామెంట్స్ ఎవరూ మరిచిపోలేరు. దానిపై ఆయన స్పందిస్తూ.. యథాలాపంగా వచ్చినవి తప్ప కావాలని అనలేదు అని విమర్శలు వచ్చాక జవాబు ఇచ్చుకున్నారు. మహిళల గురించి ఇలా యథాలాపంగా బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు బస్సుల్లో చేసుకోండని ఎవరైనా అంటారా? కానీ కేటీఆర్ మాత్రం అన్నారు. నోరు జారితే వెనక్కు తీసుకోలేం. ఇది కావాలని అన్నారా.. లేదంటే అనుకోకుండా వచ్చిందా అన్నది వేరే విషయం. నిజానికి లోపల ఏముంటుందో అదే నోటి నుంచి బయటికొస్తుందంటారు. ఇప్పుడు కేటీఆర్ విషయంలోనూ అదే జరిగిందా అన్న చర్చ జరుగుతోంది.కేటీఆర్ కు ఇంట్లో నేర్పిన సంస్కారం ఇదేనా అని అప్పట్లో మంత్రులు విమర్శించారు. అటు కేటీఆర్ వ్యాఖ్యలను తెలంగాణ మహిళా కమిషన్ అప్పట్లో సుమోటోగా తీసుకుంది. మహిళల పట్ల కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా.. కించపరిచేలా ఉన్నాయని కమిషన్ పేర్కొంది. విచారణకు హాజరుకావాలన్నది. మహిళలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో కమిషన్ ముందు విచారణకు కూడా హాజరై వివరణ కూడా ఇచ్చుకున్నారు.గతంలో అసెంబ్లీలో ద్రవ్యవినిమియ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఏకవచనంతో మాట్లాడారు. దీనిపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో తన మాటలను వెనక్కు తీసుకుంటున్నట్లు చెప్పారు. నోరు జారనేల తిరిగి వెనక్కు తీసుకోవడమేల అన్న పాయింట్లు అప్పుడూ వినిపించాయి. ఇప్పుడు కూడా బండి సంజయ్ పై కేటీఆర్ చేసిన కామెంట్లు చాలా దుమారంగా మారాయి. బండి పరీక్షలు రాయలేదని, చెప్పినా అర్థం కాదని, పేపర్ లీకులు చేయడం తెలుసు అని ఇలాంటివి పర్సనల్ గా వెళ్లాయి.నేతల నోటి దురుసుతోనే ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయం కేటీఆర్ కు తెలియంది కాదు. అయినా అదే వైఖరి కంటిన్యూ చేస్తున్నారన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జరుగుతోంది.

# హనుమాండ్లతిరుపతిరెడ్డిని సన్మానించిన

**- రాయపర్తి మండల పార్టీ నాయకులు.**



రాయపర్తి మండలం అక్టోబర్ 25 ప్రజా జ్యోతి.

తొర్రూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, పాలకుర్తి నియోజకవర్గ నాయకులు,ఇటీవల కాలంలో తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ గా ఎన్నికైన హనుమాండ్ల తిరుపతి రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపిన రాయపర్తి మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి ఈ కార్యక్రమంలోపాలకుర్తి సోమనాధ ఆలయ చైర్మన్ టీ.ఎం కృష్ణమాచార్యులు,మండల పార్టీ నాయకులు:-రెంటా ల గోవర్ధన్ రెడ్డి, చిర్ర మల్లయ్య,గబ్బేట బాబు,ఊళ్ళేంగల యాదగిరి,ఊళ్ళేంగల నర్సయ్య,గిరగాని రాజు,సారంగం, చెడుపాక వెంకట్, సుదర్శన్, శ్రీను, గు%శీ%టుక యాకయ్య మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణి



**-జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

బచ్చన్నపేట అక్టోబర్ 25(ప్రజాజ్యోతి):

మండలకేంద్రంలోని రైతు వేదిక వద్ద శుక్రవారం మండలానికి సంబందించిన 43మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం గత రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని స్పష్టం చేశారు..తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత దవాఖాన నీలిమా హాస్పిటల్ లో ఉచిత వైద్యం కొనసాగుతుందన్నారు.పార్టీలకతీతంగా దవాఖానలో వైద్య సేవలు కొనసాగుతాయనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహిపాల్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు ఇర్రి రమణారెడ్డి,బొడిగం చంద్రారెడ్డి, ఈదులకంటి ప్రతాపరెడ్డి,వడ్డేపల్లి మల్లారెడ్డి,పులిగిల్ల పూర్ణచందర్, కల్లూరి అనిల్ రెడ్డి,మద్దికుంట రాధా, గంగం సతీష్ రెడ్డి, షబ్బీర్,దాసారం శ్రీనివాస్,వేణు,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాయల్ సీడ్స్ వారి జయభేరి బిజీ 2 ప్రత్తి విత్తనంపై రైతులకు అవగాహన

మొగుళ్లపల్లి అక్టోబర్ 25 ప్రజాజ్యోతి:



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాయల్ సీడ్స్ వారి జయభేరి బిజీ 2 ప్రత్తి రకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ కంపెనీ ప్రతినిధి రాయల అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకొని, చెట్టుకు 100 నుండి 120 వరకు కాయలను కలిగి ప్రత్తి తీయుటకు సులభంగా ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం రైతు మేకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది 18 నుండి 20 క్వింటాళ్ల ప్రత్తి దిగుబడి వస్తుందని, పెట్టుబడి కూడా చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ డిస్ట్రిబ్యూటర్స్ సత్యనారాయణ రెడ్డి, శివాజీ రావు, మహేందర్, రమేష్, నరసింహారెడ్డి, కంపెనీ సిబ్బంది మల్లారెడ్డి, హరీష్, ఆంజనేయులు, రాజ్ కుమార్ లతో పాటు 20 గ్రామాల నుండి సుమారు 800 మంది పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన

**- ఎమ్మెల్యే కడియం శ్రీహరి**


లింగాల గణపురం, అక్టోబర్, 25 (ప్రజాజ్యోతి)



మండలం మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులకు ఇబ్బంధు లు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని రైతులకు తాను బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రేడ్ వన్ వడ్లకు 2320, సాధారణ వడ్లకు 2300, సన్న వడ్లకు 500 బోనస్ గా చెల్లిస్తుందని. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 23 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని. రెండు లక్షల రూపాయల పైన పంట రుణాలు తీసుకున్న రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్నారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ బుసిగంపల ఉపేందర్, జనగామ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొల్లూరి శివకుమార్, లింగాల గణపురం మండలం మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గుడి వంశీధర్ రెడ్డి, డైరెక్టర్ నీలం మోహన్, సీనియర్ నాయకులు బిట్ల బాబు, ప్రవీణ్ , మాజీ సర్పంచ్ శ్రీ పాల్, గోసంగి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కు అందజేత

భీమదేవరపల్లి అక్టోబర్ 25 ప్రజా జ్యోతి



.భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా సాంక్షన్ లెటర్ అందజేసిన తెలంగాణ భవన్ ఇన్చార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి . శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ మండల జాయింట్ సెక్రెటరీ కండె సుధాకర్ మాట్లాడుతూ వంగర గ్రామానికి చెందిన భూనాద్రి లక్ష్మి వెంకటస్వామి భార్య ప్రమాదవశాత్తు గత ఐదు నెలల క్రితం. చనిపోవడం జరిగింది.వెంకటస్వామి కుటుంబం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలుగా ఉన్నారు బోనాద్రి లక్ష్మి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున, పార్టీ ప్రమాద బీమా కింద రెండు లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. డబ్బులు మంజూరు కి సంబంధించిన లెటర్ ఇవ్వడం జరిగింది.అట్టి డబ్బులు 45 రోజుల లో వస్తాయని తెలంగాణ భవన్ ఇన్చార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇట్టి ప్రమాద బీమా పథకాన్ని కేసీఆర్ పటిష్టాత్మకంగా తీసుకువచ్చారని,, మన దేశంలో ఏ పార్టీ కూడా పార్టీ కార్యకర్తలకు ఇలాంటి ప్రమాద బీమా పథకం తీసుకురాలేదని, ఆ ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కిందని తెలిపారు.ఇట్టి డబ్బులను మరణించిన వారి పిల్లలకు వర్తించే విధంగా వారి యొక్క ఉన్నత విద్యకు ఉపయోగపడే విధంగా చూడాలని ఆయన తెలిపారు.ఆయన వెంట లీగల్ అడ్వకేట్ సోమ భరత్,వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కీర్తి రెడ్డి వాసుదేవా రెడ్డి,భీమదేవరపల్లి మండల సీనియర్ నాయకులు కండె సుధాకర్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ కూలి మృతి

ఆత్మకూరు, అక్టోబర్ 2, (ప్రజా జ్యోతి):

రోడ్డు ప్రమాదంలో మహిళ కూలి మృతి చెందిన సంఘటన అగ్రం ప్హాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అగ్రం ప్హాడ్ గ్రామానికి చెందిన మదాసి మల్లికాంబ పెద్ద కూతురు అయిన మంద సునిత (50) భర్త చనిపోవటంతో తల్లి దగ్గరే ఉంటూ దినసరి కూలి పనులు చేసుకుంటూ తన ఇద్దరు కూతురులను పోషించుకుంటుంది. గురువారం రోజున మంద సునిత వరంగల్ కెల్బి కూలి పని ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చేందుకు కాశీబుగ్గ వద్ద నిలబడి ఉండగా, వీరి గ్రామానికి చెందిన హెూంగార్డు పరికి కిషన్ పల్సర్ బైక్ పై వెళుతూ సునీతకు లిఫ్ట్ ఇచ్చాడు. వీరిద్దరూ బైక్ పై అగ్రం ప్హాడ్ సమ్మక్క సారలమ్మ పరిసర ప్రాంతానికి రాగానే కిషన్ బైక్ ను అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతుండటంతో కుక్కలు బైక్ కు అడ్డుగా వచ్చాయి. ద్వి చక్ర వాహనం అదుపుతప్పి వెనకాల కూర్చున్న సునిత క్రింద పడి స్పృహ కోల్పోయింది. చికిత్స నిమిత్తం వరంగల్ లోని ఎంజీఎం తరలించగా సునిత మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మదాసి మల్లికాంబ ఫిర్యాదు మేరకు ద్వి చక్ర వాహనం అజాగ్రత్తగా నడిపిన హెూంగార్డు కిషన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు ఎస్సై తెలిపారు.

# మానసిక ఉల్లాసానికి గేమింగ్ జోన్ దోహదం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- పిల్లలకు ఆటలు చాలా అవసరం
- సిమ్ అండ్ సామ్స్ ప్లే గ్రౌండ్, పార్టీ టౌన్ ప్రారంభం

వరంగల్ సిటీ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి)

నగరంలోని ఉర్సు గుట్ట వద్ద బట్టుపల్లి రోడ్ లో 'సిమ్ అండ్ సామ్స్' పార్టీ అండ్ ప్లే టౌన్ గేమింగ్ జోన్ ను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న మంత్రికి వేదపండితులు మంత్రోచ్ఛారణతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సురేఖ రిబ్బన్ కట్ చేసి గేమింగ్ జోన్ ను ప్రారంభించి, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. గేమింగ్ జోన్ లోని ఆటల వివరాలను తెలుసుకుని, తాను ఆటలు ఆడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను మంత్రి గుర్తు చేసుకున్నారు. ఆటల వివరాలు, డిస్కౌంట్ కార్డులు, ఫుడ్, అందిస్తున్న సౌకర్యాల పై నిర్వాహకులు మంత్రి కొండా సురేఖ కి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, 'సిమ్ అండ్ సామ్స్' పార్టీ అండ్ ప్లే టౌన్ గేమింగ్ జోన్ ప్రారంభోత్సవం సందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నేటి పోటీ యుగంలో శారీరక శ్రమకు ప్రాధాన్యత రోజు రోజుకీ పెరుగుతున్న తరుణంలో గేమింగ్ జోన్ ను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని అన్నారు. పిల్లలు సెల్ ఫోన్లకు అతుక్కుపోతున్న ఈ రోజుల్లో వారికి ఆటలు చాలా అవసరమని మంత్రి కొండా సురేఖ అన్నారు. అనంతరం సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ వరంగల్ త్రి నగరంలో తొలిసారిగా పిల్లలు మరియు టీనేజర్లకు ఆటవిడుపుగా వారి వయసుకు అనుగుణంగా క్రీడా పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా పిల్లల, యువకుల సామాజిక, శారీరక, భావోద్వేగా ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డా. ఉషశ్రీ, వంశీ, డా. ప్రణీత్,డా. అత్యున్, డా. విక్రమ్,డా. సింధు, డా. సందీప్,డా. కీర్తి, డా. వశిష్ట, మానస, సౌమ్య మరియు స్థానిక కార్పొరేటర్లు పల్లం పద్మ రవి, పోశాల పద్మ, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





# కోతికి ప్రాణం పోసిన వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్



జనగామ జిల్లా అక్టోబర్ 25(ప్రజాజ్యోతి):-

జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ కాలనీలో గుంపుగా వచ్చిన కోతుల పై ఆకతాయిలు రాళ్లతో దాడి చేయడంతో తల్లి మరియు పిల్ల కోతి లకు తలకి, నడుముకి బలమైన గాయాలవ్వడం జరిగింది. తల్లి మరియు పిల్ల కోతి దెబ్బలతో విలవిలలాడుతూ బాధపడటం చూసిన స్థానికుడు చుంచు శ్రీకాంత్ మనసు చెల్లించి, బాధపడుతూ వెంటనే స్థానిక జనగామ వెటర్నరీ హాస్పిటల్ సిబ్బందికి ఫోన్ చేయడం జరిగింది. సమాచారం అందుకున్న జనగామ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్ అతని సహాయకుడు నితిన్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని కోతులకు ఎంతో కష్ట%శ్%తో స్థానికులు శ్రీకాంత్,రాజు, మహేష్, ఇమ్రాన్, వంశీ,అశూ,కపిల్, సహాయంతో జాగ్రత్తగా వైద్యం అందించడం జరిగింది. అనంతరం బలహీనంగా ఉన్న కోతులకు తన స్నేహితుడు మహేష్ తీసుకువచ్చిన ఓఆర్ఎస్ శ్రీకాంత్ స్వతహాగా తన చేతులతో కోతులకు తాగుపించడంతో కోతులు దెబ్బల నుండి తేరుకొని చెంగుచెంగున ఎగురుకుంటూ వెళ్లడం జరిగింది. ఇది చూసిన స్థానికులు సంతోషంతో వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్ మరియు అతని సహాయకుడు నితిన్ నీ అభినందనించడం జరిగింది.

# పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రఘునాథపల్లి మండల కార్యదర్శి పొదల లవ కుమార్

రఘునాథపల్లి,,అక్టోబర్ 25( ప్రజాజ్యోతి)

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయలు తక్షణమే విడుదల చేయాలని శుక్రవారం స్థానిక మండల డిప్యూటీ తహసిల్దార్ సిహెచ్ శంకర్ కి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెమోరండం ఇవ్వడం జరిగింది.అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న 8300 కోట్ల స్కాలర్షిప్ ఫీజు మెంబర్స్ మెంటు విడుదల చేయాలన్నారు అదేవిధంగా స్కాలర్షిప్ లతో సంబంధం లేకుండా చదువు పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడం అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులకు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అనేకమార్లు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వంపై అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్నారు విద్యార్థులు అద్దె భవనంలో ఉంటూ సరేనా మౌలిక సదుపాయాలు లేక మతం అవుతున్నామన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి ఉన్నటువంటి గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు మరియు ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజుల కమిటీ ఏర్పాటు చేసి ఫీజు తీసుకోవాలని అన్నారు విద్య హక్కుచట్టాన్ని ఉల్లంఘించిన ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కందుకూరు వంశీ తేజ, మండల నాయకులు గౌడుగు రమేష్, అక్షిత,కనకరాజు,రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు




# కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ

-ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లింగాల గణపురం ,అక్టోబర్ ,25 ( ప్రజాజ్యోతి)

మండల కేంద్రంలోని బండ్ల గూడెం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్ మరియు బాత్రూంలను, తరగతి గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత మంచి నీళ్ళు వస్తున్నాయా అని వారిని అడగ్గా వస్తున్నాయని బదులిచ్చారు. మీరు బాగా చదువుకోవాలని , కూరగాయలు, పప్పులు, బియ్యం శు భ్రంగా ఉంచాలని మన ఇంట్లో పిల్లలను ఎలాగైతే శ్రద్ధగా చూసుకుంటామో ఇక్కడ ఉన్న పిల్లలను కూడా మీ పిల్లలుగా భావించి అంతే జాగ్రత్తగా చూసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం శుచి అయిన పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పంట క్షేత్రాలపరిశీలిస్తున్నఅధికారులు

కేసముద్రం,అక్టోబర్ 25(ప్రజా జ్యోతి)


కేసంద్రం మండలం కాట్రపల్లి గ్రామంలో ఈ వానాకాలం పంటల పునః పరిశీలన కార్యక్రమంలో భాగంగా, జిల్లా వ్యవసాయ అధికారిని ఎన్ విజయనిర్మల పలు పంటల క్షేత్రాలను సందర్శించి రైతులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది, వారు మాట్లాడుతూ, రైతు సోదరులు ప్రతి సీజన్లో వారు సాగుచేసిన వ్యవసాయ పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులచే నమోదు చేసుకోవాలని వారు సూచించారు, ప్రతి వానాకాలం మరియు యాసంగి సీజన్లో రైతు సోదరులు,తప్పనిసరిగా క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులచే నమోదు చేసుకోవాలని కోరారు.అలా చేయని సమక్షంలో పంట ఉత్పత్తులు అమ్మే సమయంలో రైతు సోదరులకు ఇబ్బందులు కలుగుతాయని,కావున రైతులు విధిగా పంట నమోదు చేయించుకోవాలని వారు సూచించారు, అదేవిధంగా ప్రస్తుతము వానాకాలం మరియు యాసంగి సీజన్లలో సాగు చేసిన పంటలలో వివిధ పురుగుల మరియు తెగుళ్లను గమనించి, వాటి నివారణ చర్యల మీద పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల వ్యవసాధికారి బి వెంకన్న , వ్యవసాయ విస్తరణ అధికారి మంగ శ్రీనివాస్,రైతులు పాల్గొన్నారు.

# ఇసుక లోడ్ తో ఉన్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

మొగుళ్లపల్లి ఆక్టోబర్ 25 ప్రజాజ్యోతి:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో గురువారం రాత్రి 2:30 గంటల సమయంలో పెట్రోలింగ్ చేస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ఇస్సిపేట వాగులోకి వెళ్లేసరికి పోలీసుల రాకను గమనించి గుర్తుతెలియని వ్యక్తులు ఇసుక లోడ్ తో ఉన్న రెండు ట్రాక్టర్లను వదిలి పారిపోయారని, దీంతో ఆ రెండు ఇసుక లోడ్ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనైనదని మొగుళ్ళపల్లి పోలీసులు తెలిపారు.

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



వర్ధన్నపేట అక్టోబర్ 25 (ప్రజా జ్యోతి):

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం 37 మంది లబ్ధిదారులకు 37లక్షల 4 వేల 92 రూపాయల విలువగల కళ్యాణ లక్ష్మి %d%షాదీ ముబారక్ చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,మున్సిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ,తహసీల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీఓ వెంకటరమణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ,జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు నరుకుడు వెంకటయ్య,పట్టణ అధ్యక్షులు మైస సురేష్,జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్య విభాగం జిల్లా అధ్యక్షులు గుడిబోయిన సారంగపాణి,కౌన్సిలర్లు సమ్మెట సుదీర్, తుమ్మల రవిందర్,నాయకులు పోశాల వెంకన్న,నాయకులు సిలువేరు శ్రీధర్,ఐత సుధాకర్,పులి శ్రీనివాస్,శ్రీపాదసత్యం,మహ్మద్‌చోటు,కొండేటబాలకృష్ణ,అన్వర్,తదితరు లు పాల్గొన్నారు...

# మొబైల్ ఫోన్ వాడకం తో నష్టాలేంటి

**-పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

తాండూర్ అక్టోబర్ 25 ప్రజా జ్యోతి :-

తాండూరు మండలం కరణ్ కోట్ పోలీసుల ఆధ్వర్యంలో అయినెల్లి గ్రామ శివారులోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు మొబైల్ వాడకంతో నష్టం ఏంటి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్సై విఠల్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 21న నిర్వహించిన పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. మంచి ప్రతిభ కనబరిచిన అవి విద్యార్థులకు ప్రసాక బహుమతులు అందించామన్నారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సీనియర్ ఉపాధ్యాయుడు ప్రకాష్ గౌడ్, పలువురు ఉపాధ్యాయులు, పోలీసులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లను తక్షణమే విడుదల చేయాలి




కేసముద్రం,అక్టోబర్ 25( ప్రజా జ్యోతి)

పెండింగ్ లో ఉన్న 8000 కోట్ల స్కాలర్షిప్ తక్షణమే విడుదల చేయాలని, ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈరోజు కేసముద్రం మండల కేంద్రంలో కాలేజి కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ఎదుట నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల అధ్యక్ష కార్యదర్శులు చరణ్, అరుణ్ లు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి స్కాలర్షిప్ రాకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా మాలాంటి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల పిల్లలకు చదువు అందని ద్రాక్షగా మారుతుందని తెలిపారు.... తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం మా గోసలను పట్టించుకోని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని వారు తెలిపారు...ఈ కార్యక్రమంలో విద్యార్థులు అరుణ్,వినయ్,తరుణ్, అన్వేష్,చంటి,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాండ్ పేపర్ పై నేను చెప్పినట్టు రాసిస్తేనే వీధుల్లోకి రావాలి




పర్వతగిరి, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి)

గ్రామపంచాయతీ సిబ్బంది ని గత కొద్ది నెలలుగా ఓ అధికారి గడగడలాడిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల లేక అధికారుల నిబంధనలా? రాష్ట్రంలో ఏ గ్రామపంచాయతీలో లేని నిబంధనలు ఈ గ్రామపంచాయతీ లోనే వర్తిస్తాయా ? ఆరోగ్యం బాగా లేకనో, ఆర్థికపరమైన ఇబ్బంది వల్లనో ఒక్కరోజు గ్రామపంచాయతీ సిబ్బంది విధులకు గైహాజరైనందువల్ల 50 రూపాయల బాండ్ పేపర్ తెచ్చి నేను చెప్పినట్టు రాసిస్తేనే విధుల్లోకి తీసుకుంటా అనే సంఘటన ఈ గ్రామపంచాయతీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పర్వతగిరి గ్రామపంచాయతీలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి సిబ్బంది. కరోనాకాలంలో వాళ్ల ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎనలేని సేవలందించిన గ్రామపంచాయతీ సిబ్బంది తన ఆరోగ్యం బాగాలేకనో ఆర్థిక ఇబ్బందుల వల్లనో ఒకరోజు సెలవు తీసుకుంటే మళ్లీ విధులకు రావాలంటే 50 రూపాయల బాండ్ పేపర్ పై నేను చెప్పినట్టు గా రాసి ఇస్తేనే విధులకు రావాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘు సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తూ బాండ్ పేపర్ రాయించుకుంటున్నారు. ఇన్నేళ్లుగా పనిచేస్తున్నారు కానీ ఏ ఒక్క అధికారికి ఎలాంటి బాండ్ పేపర్లు రాసి ఇవ్వకున్నానే పనిచేశారు. కానీ ఇప్పుడు ఇలా బాండ్ పేపర్ రాసి పని చేయాలంటే ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఉద్యోగం ఉంటదో డిపోతుందని భయంతో పని చేయాల్సిన దుస్థితి పర్వతగిరి గ్రామపంచాయతీలో ఏర్పడింది. ఇప్పటివరకు ముగ్గురు గ్రామ పంచాయితీ సిబ్బందితో రాయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘును వివరణ కోరగా..

గతంలో తెల్ల పేపర్ పై వ్రాసి ఇచ్చారని, అయినా కూడా రెండు మూడు నెలలకు ఒకసారి విధులకు రాకుండా తప్పియడం జరుగుతుందని అందుకే భయం ఉండాలనే ఉద్దేశంతో బాండ్ పేపర్ల మీద వ్రాయించుకున్నట్లు చెప్పారు.

# కల్లుగీత కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ

**-ఎమ్మెల్యే కి అభినందనలు తెలిపిన గీత కార్మికులు**



వర్ధన్నపేట అక్టోబర్ 25 (ప్రజా జ్యోతి ):

రాష్ట్రంలో కులవృత్తుల ప్రోత్సాహానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని, కల్లు గీతకార్మికుల రక్షణ కోసమే కాటమయ్య రక్షణ కిట్లు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని శిక్షణ పొందిన కల్లుగీత కార్మికులకు 194 మందికి కాటమయ్య రక్షణ కవచం(భద్రత కిట్) లను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంగోతు అరుణ,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత, సహాయ వెనుకబడిన తరగతుల అధికారి శంకరయ్య,తహసీల్దార్ విజయ్ సాగర్,ఎంపీడీఓ వెంకటరమణ రాష్ట్ర కల్లుగీత కార్మిక అధ్యక్షుడు బొమ్మగాని యాదగిరి గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ , ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు గౌడ కుల సంఘం నాయకులు, గీతా కార్మికులు మరియు రాష్ట్ర జిల్లా మండల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి..



**కేసముద్రం, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి ):** వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని ఎస్సై మురళీధర్ రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని పెనుగొండ రోడ్ లో శుక్రవారం వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మురళీధర్ రాజ్ మాట్లాడుతూ వాహన దారులు తప్పనిసరిగా సంబంధిత డాక్యుమెంట్లను వెంట తీసుకురావాలని ,ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని,పరిమితిని మించి ప్రవర్తించవద్దని , మద్యం సేవించి సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎదురెదురుగా ఢీకొన్న లారీలు- ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

వాజేడు, ప్రజాజ్యోతి:

ములుగు జిల్లా వాజేడు మండలంలో ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి బ్రిడ్జి వద్ద 163వ జాతీయ రహదారిపై అతివేగంగా ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వాజేడు మండలంలోని రాంపురం ఇసుక క్వారీ నుంచి ఇసుక రవాణా చేస్తున్న లారీ, మరొకటి జగన్నాధపురం వైపు నుంచి వస్తున్న క్రమంలో చీకుపల్లి బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం, ఒగోడు గ్రామానికి చెందిన చిట్టి పాక కృష్ణ, తండ్రి రాములు అను లారీ డ్రైవర్ కాలు విరిగి లారీ క్యాబిన్ లోనే ఇరుక్కుపోయాడు, మరొక డ్రైవర్ వడ్డయ్య మురళి, తండ్రి ధర్మయ్య, ఇబ్రహీంపూర్, పరిగి మండలం, వికారాబాద్ జిల్లా అను అతనకు గాయాలయ్యాయి. ఇది గమనించిన గ్రామస్తులు పోలీసు వారికి సమాచారం అందించడంతో పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని లారీ క్యాబిన్ లో ఇరుక్కుపోయిన డ్రైవర్ చిట్టి పాక కృష్ణను పోలీసులు బయటికి తీసి 108 వాహనంలో ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# సిపిఐ తెలంగాణ రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శిగా ఎన్నికై మొట్టమొదటిసారిగా

**-మహబూబాబాద్ కు విచ్చేసిన తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు కి ఘన సన్మానం**

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి)

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శిగా ఇటీవల ఎన్నికై మొట్టమొదటిసారి మహబూబాబాద్ జిల్లా సమితి సమావేశానికి విచ్చేసిన సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావుపై పూలవర్షం కురిపించారు అనంతరం మండలాల వారీగా నియోజక వర్గాల వారీగా శాలువాలు కప్పి బొకేస్ అందించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంతో అనుబంధం మరువలేనిది అన్నారు భవిష్యత్తులో మానుకోట ఉద్యమానికి అండగా ఉంటానని ఎప్పుడు పిలిచినా మానుకోట కు వస్తానని అన్నారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శిగా రాష్ట్ర పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడిగా అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా శీనన్న ఎన్నో సేవలు అందించిండని అణగారిన వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేశాడని తెలంగాణ ఉద్యమంలో శీనన్న చేసిన పోరాటం మరువలేనిది అన్నారు




పేదల ఇంటి స్థలాల కోసం పేదల హక్కుల కోసం గళం విప్పి కేసులు నిర్బంధాలు ఎన్ని పెట్టిన భయపడకుండా ఎదిగాడన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి నల్లు సుధాకర్ రెడ్డి కట్టెబోయిన శ్రీనివాస్, వరిపల్లి వెంకన్న పెరుగు కుమార్ రేషపల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న మామిళ్ల సాంబలక్ష్మి తండా సందీప్ వీరవెల్లి రవి వెలుగు శ్రావణ్, బానోతు లింగ్యా నాయక్,, మేక వీరన్న, కీదాసు రమేష్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, ఎండి మహమూద్, వంకాయలపాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి సీతక్క

కొత్తగూడ అక్టోబర్ 25(ప్రజాజ్యోతి)

కొత్తగూడ మండల కేంద్రంలో మంత్రి సీతక్కపర్యటించారు ముందుగా గుండంపల్లి శివాలయంలో పూజలు చేసి గుండంపల్లి ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొని మొండ్రాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో మోకాళ్లపల్లి లో నూతన సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి పోగుళ్లపల్లి జెడ్పీఎస్ఎస్ స్కూల్ లో మౌరిటెక్ వారి సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలో పోగులపల్లి, ఏదుళ్ళపల్లి జడ్పీ హైస్కూల్ లకు మంత్రి ఆధ్వర్యంలో అందించారు. ఈరోజు కంప్యూటర్ ల్యాబ్ ను మంత్రి సీతక్క ప్రారంభించారు. స్కూలుకు సంబంధించిన మరుగుదొడ్లు కాంపౌండ్ వాల్ ను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం డిటిఎఫ్ సంఘ బాధ్యులు అందరూ కలిసి డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో డి ఏ గురించి మంత్రి సీతక్కకు మెమోరాండం ఇచ్చారు, అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు పంచారు ఏకలవ్య మోడల్ స్కూల్ సందర్శించి వాటర్ సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు అనంతరం దుర్గారం, రామన్నగూడెం గ్రామలల్లో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ముస్మి గ్రామ పంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు అనంతరం ముస్మి గ్రామ సమీపంలో ఉన్న వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో,జిల్లా అడిషనల్





కలెక్టర్, మండలాధికారులు,విద్యాశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, సుంకరబోయిన మొగిలి యాదవ్, బిట్ల శ్రీను,రూప్ సింగ్, లావణ్య వెంకన్న, చల్ల నారాయణరెడ్డి,యువజన నాయకులు సోముల ప్రశాంత్,ప్రశాంత్ రెడ్డి, రణధీర్, మార్కెట్ డైరెక్టర్ బొల్లు రమేష్ ఆయా గ్రామ పార్టీల అధ్యక్షులు ముఖ్య నాయకులు అందరూ పాల్గొన్నారు.

# రైతు అభివృద్దే ప్రభుత్వ తాపత్రయం

**-రాజకీయాలకతీతంగా సీఎంఆర్ఎఫ్**

**-రేషన్ షాపుల ద్వారా త్వరలోనే సన్న బియ్యం పంపిణీ**

**-కౌలు రైతుబంధుకు మార్గదర్శకాలు**

**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**





కొడకండ్ల / జనగామ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి) :

రైతు అభివృద్దే ప్రభుత్వ తాపత్రయం అని, ఆరుగాలం శ్రమించి రైతు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్న వడ్లకు 500 రూపాయలను బోనస్ ఇస్తూ ప్రభుత్వం బృహత్తరమైన నిర్ణయాన్ని తీసుకుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం కొడకండ్ల మండలంలోని మొండ్రాయి, నరసింగాపురం గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ఇస్తుందని, దేశంలో సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చే బృహత్తర నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమే సాహసించారని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజులలోనే డబ్బులను రైతు ఖాతాలో వేయడం జరుగుతుందని అన్నారు. ఎస్సారెస్పీ రెండవ దశ కాలువ ద్వారా పిల్ల కాలువల నుండి చెరువులలోకి నీటిని వదిలి రైతు శ్రేయస్సు కోసం పాటుపడతామని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నామని అన్నారు. పలు రకాలుగా ఆరోగ్య ఇబ్బందులతో ఆసుపత్రులలో చేరి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలని సూచించారు. సహాయ సహకారాలు అందించడంలో రాజకీయ, వర్గ విభేదాలకు తావు లేదని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకునేందుకు ప్రభుత్వం వెలుసులుబాటు కల్పించిందని అన్నారు. త్వరలోనే రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం సరఫరా చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం రోడ్డు మార్గాన వెళ్తూ వరి పొలాలను పరిశీలించారు. నర్సింగాపురం క్రాస్ వద్ద పత్తి ఏరుతున్న మహిళా కౌలు రైతు సరోజ తో ఆమె మాట్లాడారు. రైతుతో కలిసి ఎమ్మెల్యే కాసేపు పత్తి ఏరారు. వాతావరణం సహకరించకపోగా దిగుబడి తగ్గిందని, ప్రస్తుతం కూలీల కొరత అధికంగా ఉందని రైతు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వర్షం వలన దెబ్బతిని పాడైన పత్తిని కొనుగోలు చేసేలా మార్కెటింగ్ శాఖ మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. కౌలు రైతుకు రైతుబంధును రానున్న కాలంలో అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బి.ఆర్.ఎస్ నాయకులు.



రాయపర్తి మండలం అక్టోబర్ 25 ప్రజా జ్యోతి.

రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, పాలకుర్తి బి.ఆర్.ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం రాయపర్తి మండలం శివరామ పురం గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ మండల నాయకులు నాగపూరి సోమయ్య అక్క, బి.అర్.ఏస్. పార్టీ మండల అధికార ప్రతినిధి తాళ్ల పెల్లి సంతోష్ గౌడ్ పెద్దమ్మ పోషల శాంతమ్మ ఇటీవల అనారోగ్యం తో రంగసాయి పేట పట్టణం లో మరణించగా వారి దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన బి.అర్.ఏస్. పార్టీ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి బి.అర్.ఏస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు చెవ్వ కాశినాధం తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటేషన్ల పై పునర్ పరిశీలన చేయాలి

-టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు వై క్రాంతి కుమార్

-ఉపాధ్యాయుల డిప్యూటేషన్ వ్యవహారంలో అవకతవకలు

-విద్యార్థుల పరిస్థితి ఏంటి




నరసింహుల పేట అక్టోబర్ 25 ప్రజా (జ్యోతి)

శుక్రవారం రోజు టి పి టి ఎఫ్ నరసింహుల పేట మండల శాఖ సమావేశం స్థానిక మండల కేంద్రంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నరసింహులపేట మండల అధ్యక్షులు వై క్రాంతి కుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు వై క్రాంతి కుమార్ మాట్లాడుతూ మన మండలంలో ఎంఈఓ బొబ్బిళ్ళపాటి రామ్మోహన్ రావు డిప్యూటేషన్ ల గురించి వివిధ ఉపాధ్యాయ సంఘాలతో తేదీ 22-10-2024 నాడు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పాఠశాలలో ఉన్న తరగతుల కంటే అదనంగా ఉపాధ్యాయులు ఉన్న పాఠశాల నుండి ఉపాధ్యాయులు అవసరం ఉన్న పాఠశాలలకు,ఏకోపాద్యాయ పాఠశాలల కు కేటాయించమని కోరినప్పటికీ పట్టించుకోకుండా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కాకుండా కొంతమంది ఉపాధ్యాయుల కోరిక మేరకు డిప్యూటేషన్లకు సంబంధించిన ప్రపోజల్స్ ను తయారుచేసి డీఈవో కార్యాలయానికి పంపడం జరిగింది. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు సూచనలు చేసినప్పటికిని వాటిని పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరించడం జరిగింది. కావున డీఈవో కార్యాలయానికి పంపిన డిప్యూటేషన్ అభ్యర్థనలను పున సమీక్షించాలని కోరడం జరిగింది.ఈ సమావేశం లో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాకన్న నరసింహరావు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# పోషణ అభియాన్ పై సమీక్ష

– డిఎంహెచ్వో వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహణ

వరంగల్ సిటీ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి):

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం మీటింగ్ హాల్లో డా. కె వెంకటరమణ అధ్యక్షతలో వైద్య ఆరోగ్యశాఖ మరియు ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ సంయుక్తంగా ఎస్ఏఎం (సివియర్ ఆక్యూట్ మాల్న్యూట్రిషన్) ఎంఏఎం (మోడరేట్ ఎక్యూట్ మాల్న్యూట్రిషన్) లపై సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరముల పిల్లల ఎదుగుదల, మానసిక స్థితి, ఆరోగ్య సమస్యలు అధిగమించడానికి పోషణ అభియాన్ కార్యక్రమం ద్వారా తీసుకోవలసిన జాగ్రత్తలపై డిఎంహెచ్ఓ డా. కే వెంకటరమణ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో, పట్టణములో, రెండు శాఖలు సమన్వయంతో పనిచేసే పిల్లల సమస్యలను విశ్లేషించి తాగు పోషణ అభయం ద్వారా అందించవలసిన సేవలు, చికిత్సలు అందించి నేటి బాలలే రేపటి పౌరులుగా గుర్తించి తల్లిదండ్రులకు ఆర్థిక, మానసిక శోభకు గురికాకుండా సేవలందించాలని కోరినారు. డిడబ్ల్యూ రాజమణి వరంగల్ మాట్లాడుతూ ప్రతి బిడ్డను పరీక్షల ద్వారా వారి యొక్క అవసరాల నిమిత్తం సేవలందించి అట్టి వివరాలను పోషణ అభియాన్ యాప్ లో అప్లోడ్ చేయాలని కోరినారు .వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ తల్లి బిడ్డల ఆరోగ్య విషయంలో సమన్వయంతో పని చేస్తేనే సరియైన ఫలితాలు వస్తాయని తెలిపినారు శిశు మరణాలను, మాతృ మరణాలను జరగకుండా మన సేవలు ఉండాలని, పిల్లల ఎదుగుదల విషయంలో తగు సూచనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే వెంకటరమణ, జిల్లా వెల్ఫేర్ అధికారిని రాజమణి, జిల్లా ఎమనైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాష్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆర్ బి ఎస్ కే వైద్యాధికారులు, సిడిపిఓలు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# ఇరుకు బ్రిడ్జి లకు విముక్తి.. ప్రమాదాలకు స్వస్తి

-నాలుగు దశాబ్దాల కాలం నాటి బ్రిడ్జీ లకు విముక్తి.

దామెర, అక్టోబర్ 25, (ప్రజా జ్యోతి):



ఇరుకు బ్రిడ్జిలకు విముక్తి కలిగి, ప్రమాదాలకు స్వస్తి పలుకనుంది. జాతీయ రహదారి వెంట దామెర మండలం ఒగ్లాపూర్, ఊరుగొండ గ్రామాల వద్ద ఇరుకుగ ఉన్న ఎస్సారెస్పీ బ్రిడ్జి ల వద్ద నిత్యం ప్రమాదాలకు నెలవుగా ఉండేది. నాలుగు దశాబ్దాల కాలం నాటి ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జీలు కూల్చనున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డు వెడల్పు చేయడంతో ఇరుకుగా ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జీలు కూల్చి పునర్నిర్మాణం చేయనున్నారు. దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామ శివారులో ఉన్న కెనాల్, ఊరుగొండ నాగన్న ఆర్చి వద్ద మరొకటి కూల్చి వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 45 సంవత్సరాల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ ఫార్మేషన్ జరిగిన సమయంలో కెనాల్ రోడ్డు దాటాల్సిన చోట ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. రోడ్డు వెడల్పు చేసి, బ్రిడ్జి లను అలాగే వదిలేయడంతో రాత్రిపూట జాతీయ రహదారి వెంట ప్రయాణించే వారికి నిత్యం ప్రమాదా లకు నిలియంగా మారేది. గతంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కెనాల్ లోనికి దూసుకెళ్లే క్రమంలో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే భారీ వాహనాలు రాత్రి పుట అదుపు తప్పి ఊరుగొండ కెనాల్ లో పడిన సంఘటనలు లేకపోలేదు. బ్రిడ్జి ల పునర్నిర్మాణంతో నేషనల్ హై వే పై వెళ్లే వారికి ప్రమాదాల నుండి విముక్తి కలుగనుంది.

# క్షయ (టి బి ) వ్యాధి ప్రాణాంతకమైనది, నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలి!!

**-ప్రభుత్వ వైద్య అధికారి డా. రాజ్ కుమార్ జాదవ్.**

గార్ల,అక్టోబర్ 25(ప్రజా జ్యోతి)

క్షయ(టి బి )వ్యాధి ఉన్న వారు దగ్గిన, తుమ్మిన, ఉమ్మిన, గాలి ద్వారా వేరే వారికీ వస్తుంది...

క్షయ (టి బి )వ్యాధి ఒక అంటు వ్యాధి...క్షయ (టి బి )వ్యాధి ఊపిరితిత్తులకు నాశనం చేయడంతో పాటు ప్రాణాంతకమైనది, క్షయ(టి బి ) వ్యాధి సోకిన తదుపరి చర్మము నుండి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వ్యాప్తి చేందగలదు. హెచ్ఐవి, లేదా వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న బాధితులకు టి బి సులభంగ సోకుతుంది, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి టి బి సోకే ప్రమాదం ఎక్కువ...టి బి వ్యాధి ఉన్న వారు మంచి పోషకాహారం భుజించాలి...తొలి దశలోనే టి బి వ్యాధికి గుర్తించి, సత్వర వైద్యంతో ఉపశమనం కలుగుతుంది, ప్రాణాంతకమైన వ్యాది నుండి తప్పించుకునే అవకాశం ఉందన్నారు. క్షయ(టి బి )వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి మందులు వాడకపోతే సమాజంలోని మరింత మందికి సోకే ప్రమాదం ఉందని, టి బి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గార్ల మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల పరిధిలోని గార్ల పట్టణ కేంద్రంలో మరియు ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో తరుచుగా దగ్గుతో బాధపడుతున్న అనుమానితులు 40 మంది నుండి తేమడా సేకరించి, టిబి పరీక్షలకు పంపిస్తూ, తదనంతరం డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ, క్షయ(టి బి )వ్యాధి గ్రస్తులకు దగ్గు, కఫం పడటం,ఆకలి మందగించడం, నిద్రలేమి, బరువు తగ్గడం, రోజు సాయంత్రం పూట జ్వరం రావడం, కఫం తో రక్తం పడటం లాంటి లక్షణాలు కనిపిస్తాయని



అన్నారు. టి బి వ్యాధి రోగ నిరోధక శక్తి తగ్గిన వారికి, హెచ్ఐవి, మధుమేహం వ్యాధులతో బాధపడుతున్న వారికీ త్వరగా సోకుతుందన్నారు.క్షయ(టి బి )వ్యాధి ఒక అంటూ వ్యాధి అని, క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు సంబంధించినదైనా, చర్మము నుండి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వస్తుందన్నారు. క్షయ వ్యాధి ఉన్నవారు దగ్గిన, తుమ్మిన, ఉమ్మిన,గాలి ద్వారా వేరే వారికి వ్యాప్తి చెందుతుందని,క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి సత్వర వైద్యంతో ఉపశమనం కలుగుతుందని అన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోకపోతే సమాజానికి ఈ వ్యాధితో పెను ముప్పు పొంచి ఉందన్నారు. క్షయ వ్యాధి ఉన్నవారు మంచి పోషకాహారం భుజించాలని, చేతులను శుభ్రంగా, తరచుగా కడగాలని, దగ్గినప్పుడు మోచేయి నోటి రుమాలతో కప్పాలని, వ్యాధి ఉన్న వ్యక్తులతో సన్నిహిత సంబంధాలకు దూరంగా ఉండటం వలన క్షయ (టి బి )వ్యాధిని నిర్మూలించవచ్చని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో హెచ్ ఈ ఓ ఇస్మాయిల్,సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ జయరాం, హెల్త్ సూపర్వైజర్ ఎల్.టి రత్నాకర్, ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని కుటుంబానికి మిత్రుల చేయూత

కొడకండ్ల / జనగామ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి) :

చిన్ననాడు కలిసి చదువుకున్న మిత్రుడు అకాల మరణం చెందగా స్నేహితులందరూ కలిసి కుటుంబానికి చేయూత అందించారు. ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మండల కేంద్రానికి చెందిన గులాం గౌస్ పాషా (48), కొడకండ్ల పోలీస్ స్టేషన్ లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందాడు. గౌస్ పాషా తో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 - 93 వ సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న స్నేహితులంతా కలిసి తమ వంతు సహాయంగా 75000 రూపాయలు సేకరించి శుక్రవారం గౌస్ పాషా కుటుంబానికి అందజేశారు. వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గౌస్ పాషా స్నేహితులు పొన్నం వెంకన్న, మసురం గణేష్, సుంకరనేని శశి,



బందారపు శ్రీను, కోట జనార్దన్, పెనుగొండ శ్రీనివాస్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# సైకిల్ తొక్కి సందడి చేసిన మంత్రి సురేఖ

వరంగల్ సిటీ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి):

నగరంలోని బట్టల బజార్ లోని ఆంధ్ర బాలిక ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు కొండా మురళి జన్మదినాన్ని పురస్కరించుకుని మడిపెల్లి కృష్ణ ఆధ్వర్యంలో సైకిళ్ళను పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని తన చేతుల మీదుగా విద్యార్థినిలకు సైకిళ్ళను పంపిణీ చేశారు. బాలికలతో కలిసి సైకిల్ తొక్కి వారిని ఉత్సాహపరిచారు. బాగా చదువుకొని రాణించాలని ప్రోత్సహించారు. రాష్ట్ర మంత్రి స్థానంలో ఉండి విద్యార్థులతో కలిసిపోయి సైకిల్ తొక్కడంతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఇంత గొప్ప స్థాయిలో ఉండి కూడా సామాన్యులతో మమేకమవడం 'కొండా' దంపతుల నైజం అని అక్కడ ఉన్న ప్రజలు చర్చించుకున్నారు.



## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**-ఎస్సై మాలోత్ సురేష్**




నరసింహులపేట అక్టోబర్ 25 (ప్రజా జ్యోతి)

నరసింహుల పేట మండలంలోని పడమటిగూడెం నికి చెందిన అక్కిరెడ్డి వేణు అనే వ్యక్తి హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి టెలిగ్రామ్ లో ఓ కంపెనీకి సంబంధించిన లింకు రావడంతో ఓపెన్ చేశాడు ఆ కంపెనీలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయి అని ఆశ చూపడంతో ఏడు లక్షల 69 వేల 360 రూపాయలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు మోసపోయిన అని తెలుసుకొని సైబర్ క్రైమ్ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ఒక లక్ష అయిదు వేల మూడు రూపాయలు హోల్డ్ లో పెట్టగలిగారు. ఈ విషయంపై వేణు ఫిర్యాదు మేరకు ఎస్సై మాలోత్ సురేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## నిరుపేద బిజెపి కార్యకర్తకు ఆర్థిక సాయం



వరంగల్ సిటీ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి):

నగరంలోని చార్ బౌళి ప్రాంతంలో నివసిస్తున్న భారతీయ జనతా పార్టీ కార్యకర్త గంజి శ్రీధర్ గత నెల రైలు ప్రమాదంలో కాలు విరిగి శస్త్ర చికిత్స జరిగింది. శ్రీధర్ నిరుపేద కుటుంబానికి చెందినవాడు. పైగా కాలు విరగడం మూలాన మందుల కోసం, కుటుంబ పోషణ కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ వ్యాక్ (వి ఏ కే) ఫౌండేషన్ ద్వారా శ్రీధర్ కు మందులు ఇతర అవసరాల కోసం 8 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ వన్నాల అరవింద్ కుమార్ స్థాపించిన సమైక్య వ్యాక్ ఫౌండేషన్ ద్వారా సుమారు ఏడువందల పైగా కుటుంబాలకు నెలకు పది కిలోల బియ్యం, పలు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వారి కంటి చూపు కొరకు ఆపరేషన్లు చేయించడం జరుగుతుంది. అంతేకాకుండా తల్లిదండ్రి కోల్పోయిన అనాధ పిల్లల చదువుల ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవింద సింగ్, 26వ డివిజన్ అధ్యక్షుడు అకిన సాగర్, 99వ బూతు అధ్యక్షుడు రామ నాగార్జున, 136వ బూత్ అధ్యక్షుడు వంగ సంతోష్, బిజెపి కార్యకర్తలు సాయి, గోపు రాజేష్ ,యువమోర్చా డివిజన్ అధ్యక్షులు పవన్ లడ్డు, గంజి గోపి, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు భద్రకాళి శేషు కు ఆహ్వానం



**వరంగల్ సిటీ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి):**

నగరంలోని ఉర్సు గుట్ట కుడా మైదానంలో దీపావళి సందర్భంగా అక్టోబర్ 30వ తేదీన నిర్వహించే నరకాసుర వధ ఉత్సవాలకు రావాల్సిందిగా భద్రకాళి దేవస్థాన ప్రధాన పూజారి భద్రకాళి శేషు అయ్యగారికి ఉత్సవ కన్వీనర్ మరుపల్ల రవి శుక్రవారం ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషు అయ్యగారు మాట్లాడుతూ ప్రాచీన కాలంలో జరిగిన సంఘటనలు నేటి తరానికి తెలియజేయడానికి నరకాసుర వధ ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నరకాసుర వధ వీక్షించిన తర్వాతనే ప్రజలు దీపావళి నోములు జరుపుకుంటే వారికి పుణ్య ప్రదమని అన్నారు. ఆహ్వాన పత్రికను అందజేసిన వారిలో ఉత్సవ సహాయ కార్యదర్శి అవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, అన్న కుమారస్వామి, మరుపల్ల శివ, దాసరి రాజు లు ఉన్నారు.

# అత్యంత ఖచ్చితత్వంతో పశుగణన

**- జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా**
**- పశు గణన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ**



**వరంగల్ సిటీ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి):**

జిల్లాలో అత్యంత ఖచ్చితత్వంతో పశు గణాంకాల నమోదు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశు గణన వాల్‌పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేటి నుంచి నాలుగు నెలల పాటు (28 ఫిబ్రవరి 2025 వరకు) 21వ జాతీయ పశు గణన ప్రక్రియ చేపట్టడం జరుగుతున్నదని, ఇందుకోసం జిల్లాలో 58 మంది పశుగణనకర్తలు, 24 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 13 మండలాలు 161 రెవెన్యూ గ్రామాల్లో, 70 మునిసిపల్ వార్డు/ పట్టణ ప్రాంతాల్లో పశు గణన జరుగుతుందన్నారు. జిల్లాలోని 1,24,603 మంది రూరల్, 1,17,982 మంది కార్పొరేషన్, 17,936 మంది మునిసిపాలిటీ లలోని కుటుంబాలను సర్వే చేసి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు ఇలా 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించి, యాప్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. పశు గణన ఆధారంగా నిధులతో పాటు వ్యాధినిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు వంటివి సరఫరా అవుతాయని ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు గణన కర్తలకు సహకరిస్తూ కచ్చితమైన వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాలకృష్ణ, జిల్లా నోడల్ అధికారి బాలాజీ, పశు వైద్యాధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**స్టేషన్ ఘనపూర్ ప్రతినిధి, అక్టోబర్ 25 ( ప్రజాజ్యోతి ) :-**



మాజీ ఉపముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులకు ఇబ్బందు లు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని రైతులకు తాను బాధ్యత తీసుకొని రుణమాఫీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రేడ్ వన్ వడ్లకు 2320, సాధారణ వడ్లకు 2300, సన్న వడ్లకు 500 బోనస్ గా చెల్లించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 23 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని స్పష్టం చేశారు. రెండు లక్షల రూపాయల పైన పంట రుణాలు తీసుకున్న రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. అందుకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అప్పులు తీసుకొచ్చి మరీ రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తూ వారికి అండగా ఉంటుందన్నారు. డిసెంబర్ 9వ తేది లోపు మొత్తం 42 లక్షల మంది రైతులకు 31 వేల కోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, పిఏసిఎస్ చైర్మన్, వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిది

**- ఊడుగుల.అశోక్,మాజీ ఉప సర్పంచ్**

**నెక్కొండ అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి )**



నెక్కొండ మండలంలోని అప్పల్ రావుపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు,మాజీ ఉప సర్పంచ్ ఊడుగుల.అశోక్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిదని అన్నారు.లబ్ధిదారులైన ఎలికట్టె.అశ్విని శ్రీనివాస్,నలిమెల.వనమ్మకు చెక్కులు అందజేసారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎలికట్టె.శ్రీకాంత్, యాసంహరికృష్ణ , నాయకులు యాకూబ్, బీరం.రమేష్, కదిరె.సురేష్, క్రాంతి, ఆడేపు.శ్రీనివాస్, వడ్డె.యాకాంబ్రం, యాకయ్య,కుమార్,రమేష్, ఉ పేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పి.డి.ఎస్.యు.50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి

**-పి.డి.ఎస్.యు. పూర్వ జిల్లా అధ్యక్షులు పైండ్ల యాకయ్య**

**మహబూబాబాద్ అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి )**



అక్టోబర్ 27న ఖిలా వరంగల్ కేంద్రంలో జరుగు పి.డి.ఎస్.యు.50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పి.డి.ఎస్.యు. పూర్వ వరంగల్ జిల్లా అధ్యక్షులు పైండ్ల యాకయ్య పిలుపునిచ్చారు.శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పి.డి.ఎస్.యు. 50 వసంతాల స్వర్ణోత్సవ సభ కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా పైండ్ల యాకయ్య మాట్లాడుతూ పి.డి.ఎస్.యు. ఆవిర్భవించి అక్టోబర్ 12, 13 నాటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల కోసం,శాస్త్ర విద్య సాధన, సమానత్వ సమాజ స్థాపన ధ్యేయంగా 50 ఏళ్లుగా పిడిఎస్యు అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో అనేకమంది విద్యార్థి అగ్రనాయకులైన కామ్రేడ్ జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, బొమ్మ సాంబయ్య, కోలాశంకర్, దుస్సా చేరాలు , రంగవల్లి, వీరన్న లాంటి ఎంతోమంది విద్యార్థి ఉద్యమంలో అమరులైనారని గుర్తు చేశారు. అక్టోబర్ 27న ఖిలా వరంగల్ లో పి.డి.ఎస్.యు. పూర్వ మరియు ప్రస్తుత విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థి అమరవీరుల స్థూపావిష్కరణ , బొడ్డు కుమారస్వామి (బి.కే) రాసిన పాటల పుస్తకావిష్కరణ,అనంతరం సభ, సాయంత్రం 6 గంటలకు బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు పి.డి ఎస్.యు. పూర్వ మరియు ప్రస్తుత విద్యార్థులతో పాటు ప్రజాస్వామికవాదులు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల గౌతం, గణేష్, చరణ్, దేవేందర్, జశ్వంత్, నితిన్, అభిలాష్, సుమంత్ గౌడ్, భాను చారి ,హర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

**- నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు**
**- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలసి గ్రేటర్ పరిధి లోగల వర్ధన్న పేట నియోజక వర్గ అభివృద్ధి పనులపై సమీక్ష**
**- అధికారులు సమన్వయంతో డివిజన్ల అభివృద్ధికి కృషి చేయాలి**



**వరంగల్ సిటీ, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి):**
అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హల్ లో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే తో కలసి గ్రేటర్ వరంగల్ లోని వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో గల 13 డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, ఫ్లడ్ డ్యామేజ్, పట్టణ ప్రగతి, గ్రీన్ ఫండ్స్, ఎస్సి సబ్ ప్లాన్, స్మార్ట్ సిటీ



తో పాటు ఇతర నిధుల క్రింద 2023 జనవరి నుండి నేటి వరకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో పుర్తయిన, కొనసాగుతున్న, అగ్రిమెంట్, టెండర్ ప్రక్రియ, మొదలుపెట్టాల్సిన, వివిధ పనుల పురోగతి, శానిటేషన్, జంక్షన్ల అభివృద్ధి, స్వచ్ఛదనం పచ్చదనం, స్మశాన వాటికలు, వీధి దీపాలు తదితర అంశాలపై 1, 2, 3, 14, 43, 44, 45, 46, 55, 56, 64,65, 66 డివిజన్లలో ఆయా డివిజన్ల వారీగా ఆయా శాఖల అధికారులతో కూలంకషంగా సమీక్షించి సమర్ధంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే లు సమీక్షిస్తూ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో గల 13 డివిజన్లకు గత జనవరి 2023 నుండి రూ.60 కోట్ల 67 లక్షలతో 409 అభివృద్ధి పనులు మంజూరు కాగా ఇప్పటివరకు రూ.18 కోట్ల 36 లక్షలతో 198 పనులు పూర్తయి రూ. 11 కోట్ల 42 లక్షల 48 పనులు పురోగతిలో ఉన్నాయని, 21 పనులకు అగ్రిమెంట్ పూర్తయినాయని, 96 పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఇంకను మిగిలియున్న 40 పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. విలీన గ్రామాల్లో రోడ్లు, సైడ్ డ్రైనేజీల తోపాటు స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా కుంటలను అభివృద్ధి చేయడంతో పాటు సెంట్రల్ మీడియన్లలో ప్లాంటేషన్, డివిజన్లలో చేపట్టిన, చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయ్యి పనులు ప్రారంభించని గుత్తేదారులను తొలగించి వేరే కాంట్రాక్టర్లతో పనులు చేయించాలని అన్నారు. మిషన్ భగీరథ తాగునీరు అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సరఫరా జరగాలని, అవసరమైనచోట మోటర్ల మరమ్మత్తులు చేస్తూ పైపులైన్ల లీకేజీ అరికట్టాలనితెలిపారు. 13 డివిజన్లకు శానిటేషన్ కొరకు కేటాయించిన వాహనాలు, సిబ్బంది వివరాలు అధికారులకు అడిగి , కొన్ని ప్రాంతాల్లో/ తండాల్లో ప్రతిరోజు చెత్త సేకరణ జరగడంలేదని ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రణాళిక ప్రకారం పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు. చెత్త సేకరణకు ఆటంకం కలుగకుండా పారిశుద్ధ్య వాహనాలను త్వరితగతిన రిపేర్లు చేయించాలని సూచించారు. నాలాల ఆక్రమణ, అనధికార నిర్మాణాలు జరుగకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ ను మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టారని చెప్పారు. నగర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ నగర సమగ్రాభివృద్దే ధేయంగా కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులను చేపడుతున్నామని, వాటిని సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. విలీన గ్రామాల అభివృద్ధిపై కార్పొరేటర్ల సమన్వయంతో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. విలీన గ్రామాలలో పట్టణ వాతావరణాన్ని నెలకొలిపే విధంగా అభివృద్ధి జరగాలని అందుకు గుత్తేదారులు గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. జిడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాఖడే మాట్లాడుతూ అభివృద్ధి పనులు గడువులోగా పూర్తీ చేయుటకు ప్రతిరోజు ఇంజనీరింగ్ అధికారులు డివిజన్లలో పర్యటించి అభివృద్ధి పనులను వేగవంతంగా జరిగేలా నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గానికి సంబంధించి రూ.114 కోట్ల వ్యయంతో 21 ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందని అందులో 5 ప్రాజెక్టులు పూర్తి చేయడం జరిగింది. మిగితా ప్రాజెక్ట్ లను వేగవంతం పూర్తి చేయాలని అన్నారు. ఈ సమీక్షలో అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎస్ ఈ రాజయ్య, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, కుడా ఈఈ భీం రావు, ఉప కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, బల్దియా ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్, కుడా, ఎన్పిడిసిఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం బోనస్ పై రైతులు అభిప్రాయసేకరణకు హాజరుకావాలి

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి):**
రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ 2024 సంబంధించిన వరిలో సన్న వడ్ల కొనుగోలుపై రైతు అభిప్రాయ సేకరణ కొరకు ములుగు జిల్లా ములుగు వెంకటాపూర్ మండలాల పరిధిలోని రైతులకు సన్న రకాలకు ఇచ్చే రూ. 500 ఒక క్వింటాకు ఇచ్చే బోనస్ కు సంబందించిన సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేయడం జరిగిందని వెంకటాపూర్ మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.రైతు సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ధాన్యం సన్నరకాల కొనుగోలుపై మీ సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు.రైతులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి







**- కుమ్మరి కుంట్ల నాగన్న**

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 25(ప్రజాజ్యోతి)**
శుక్రవారము రోజు మున్సిపాలిటీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని మైబాద్ మున్సిపల్ లో రాష్ట్ర పిలుపులో భాగంగా ఉదయం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ నుండి హైదరాబాదు బయలుదేరడం జరిగింది సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులు అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనం ఇచ్చి మున్సిపాలిటీ కార్మికుల తోటి ఎక్కువ పని చేయించడం జరుగుతుంది మున్సిపాలిటీ కార్మికులు మరణిస్తే మట్టి ఖర్చుల కింద 30 వేలు ఇవ్వాలని సమాన పనికి సమానమైన ఇవ్వాలని వీరిని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని సమాన పనికి సమాన వ్యక్తులు ఇవ్వాలని చదువుకున్న వారికి డ్రైవర్లుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా ప్రమోషన్స్ ఇవ్వాలని మున్సిపల్ కార్మికులకు పనిచేస్తున్న ప్రదేశాలలో ఏమైనా జరుగుతే కట్టించాలని ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం పలు డిమాండ్లతో హైదరాబాదులో 33 జిల్లాలను కలుపుకొని ధర్నా నిర్వహించ జరుగుతున్నది ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికుల సంఘం కార్యదర్శి కాంపల్లి శ్రీనివాసు గుర్రాల పుష్పరాజు కందుకూరు జానీ మనోహర్ ఎల్లయ్య ఇమ్మడి పద్మ లక్ష్మి సుజాత రజిని వీరన్న వెంకన్న మల్లేష్ వీరన్న రాజు అంజయ్య తదితరులు పాల్గొన్నారు

# కార్డు దారులందరికి పని కల్పిస్తాం

-ఏపీవో శారద



దామెర, అక్టోబర్ 25, (ప్రజా జ్యోతి):
ఉపాధి హామీ కార్డు దారులందరికి 100 రోజులు పని కల్పిస్తామని ఏపీవో శారద తెలిపారు. శుక్రవారం దామెర మండలం ఊరుగొండ, కోగిల్వాయి గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 266 రకాల పనులు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు ఆమె తెలిపారు. గ్రామానికి ఉపయోగపడే పనులు చేసుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్డు దారునికి 100 రోజులు పని కల్పించే విధంగా ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుర్తించిన పనులను చదివి కార్డు దారులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన



- ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్...

డోర్నకల్ అక్టోబర్ 25( ప్రజా జ్యోతి)...
డోర్నకల్ మండలంలోని ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురైన జర్నలిస్ట్ అజ్మీర సక్రం మంచానికే పరిమితమైన డోర్నకల్ మండల జర్నలిస్ట్ సక్రానాయక్ పరిస్థితి ని తెలుసుకొని డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ జర్నలిస్ట్ సొంత గ్రామమైన దుబ్బ తండ చేరుకొని సక్రం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు తెలిపారు.తదనంతరం ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. తాళ్లూరి గంగాధర్, రెడ్డబోయిన శంకర్, అజ్మీర రాంలాల్, ఇస్లావత్ అనిల్, ఇస్లావత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

# 33 వేల కోట్ల రైతుల రుణమాఫీ చేస్తాం

-ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్
-షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం
-రైతు అభివృద్దే ప్రభుత్వ తాపత్రయం
-రేషన్ షాపుల ద్వారా త్వరలోనే సన్న బియ్యం పంపిణీ
-ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్



డోర్నకల్ అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి) :
రైతు అభివృద్దే ప్రభుత్వ తాపత్రయం అని, ఆరుగాలం శ్రమించి రైతు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు సన్న వడ్లకు 500 రూపాయలను బోనస్ ఇస్తూ ప్రభుత్వం బృహత్తరమైన నిర్ణయాన్ని తీసుకుందని ప్రభుత్వ విప్ డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ వీరన్న ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతనలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 23 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని స్పష్టం చేశారు. రెండు లక్షల రూపాయల పైన పంట రుణాలు తీసుకున్న రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. అందుకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అప్పులు తీసుకొచ్చి మరీ రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తూ వారికి అండగా ఉంటుందన్నారు. డిసెంబర్ 9వ తేది లోపు మొత్తం 42 లక్షల మంది రైతులకు 31 వేల కోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వందని తెలిపారు. అనంతరం పలువురికి షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. త్వరలోనే రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం సరఫరా చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం రోడ్డు మార్గాన వెళ్తూ వరి పొలాలను పరిశీలించారు. కౌలు రైతుకు రైతుబంధును రానున్న కాలంలో అందజేయనున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు కాల సుమేర్ చంద్ జైన్, మండల అధ్యక్షుడు డి ఎస్ జగదీష్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తాళ్లూరి గంగాధర్, ఖాదర్ బాబా, యాల్లావుల హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ,మాదా శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, శీలం శ్రీనివాస్, రెడ్డబోయిన శంకర్, వంకాయలపాటి రామారావు, యడమ కంటి రవి, మంద రామారావు, తాళ్లూరి రామయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# బిజెపి దుర్మార్గమైన పాసిస్టు మతోన్మాదంపై పోరాటాలు జరపాలి

- సిపిఎం మండల మహాసభ లో-
జి.నాగయ్య,సోమయ్య




గార్ల అక్టోబర్ 25 (తెలుగు ప్రభ)
బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గ మైన ఫాసిట్టు మతోన్మాద విధానాలపై కమ్యూనిస్టు శ్రేణులు నిరంతరం పోరాటాలు చేసేందుకు ప్రజలతో సంబంధాలు కలిగి ఉండాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య లు అన్నారు. స్థానిక వర్తక సంఘం భవనంలో సిపిఎం మండల 9వ మహాసభ శుక్రవారం సీతారాం ఏచూరి నగర్ లోని సూర్యాపు సావిత్రమ్మ ప్రాంగణంలో జి.రాజారావు, ఎ.సత్యవతి, ఐ.గోవింద్ లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ మహాసభ లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ లు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాదంపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. బిజెపి పార్టీ అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం, రాజ్యాంగ సంస్థల హక్కుల ను హరిస్తూ అనేక చట్టాలు మారుస్తూ, క్రిమినల్ చట్టాలు తీసుకొచ్చి రాజ్యాంగానే మార్చేయడం కోసం ప్రయత్నాలు చేస్తుందని అందోళన వ్యక్తం చేశారు. వామపక్షాలు వత్తిడితో ఉపాధి హామీ చట్టం, అహార భద్రత,పోడు సాగు దారులకు హక్కు చట్టం, సమాచార హక్కు చట్టాలు వచ్చాయని చెప్పారు. ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీల పని అయి పోయిందని గ్లోబల్ ప్రచారం చేస్తున్న కార్పోరేట్ మీడియా, తప్పు ప్రచారం చేస్తున్న కొందరు వ్యక్తులు శ్రీలంకలో ఇటీవల కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిందనే విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు.పదేండ్లు అధికారంలోకి ఉండి ప్రజలకు ఏం ప్రయోజనాలు చేకూర్చని బిఆర్ ఎస్ పార్టీ కి హామీలు అమలు చేయాలనే హక్కు లేదని చెప్పారు. అచరణ సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చి పెన్షన్ 4 వేల పెన్షన్ లు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగాలు రైతుబంధు తదితర హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర ప్రభుత్వం పై పోరాటాలు చేస్తామని చెప్పారు.బిజెపి ని నిరోధించకుంటే ప్రజాస్వామ్యం ఉండదని, దుర్మార్గమైనటువంటి బిజెపిని నిలువరించేందుకు అన్ని పార్టీల ను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.ముందు గా మహాసభ ప్రాంగణంలో సీతారాం ఏచూరి,పుచ్చలపల్లి సుందరయ్య, బుద్దాదేవ్ భట్టాచార్య,మల్లు స్వరాజ్యం, దేవుల పల్లి యాకయ్య,గుగులోత్ ధర్మా చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.పార్టీ జెండా ను సినియర్ నాయకులు అంబటి వీరాస్వామి ఎగురవేశారు. పట్టణ పురవీధులలో ఎర్ర జెండాలను చేత పట్టుకొని భారీ ప్రదర్శ నిర్వహించారు.ప్రజానాట్య మండలి సభ్యులు పాడిన పాటలు ప్రజలను అలోచింపజేశాయి.ఈ మహాసభ లో జిల్లా నాయకులు శెట్టి వెంకన్న,ఆకుల రాజు, అలవాల వీరన్న,కె.కవిత,బి.హరి, బి అశోక్ కుమార్,కుంట ఉపేందర్,నక్కా సైదులు,మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, సినియర్ నాయకులు జె.నరసింహారావు,కె.ఈశ్వర్ లింగం, వి.వెంకటేశ్వర్లు, టి.వి.రమణ,మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఓపెన్ హౌస్ ను ప్రారంభించిన సిపి



-పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు..

-వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా.

హనుమకొండ జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 25, ప్రజా జ్యోతి.

ప్రజల భద్రత నిరంతరం పనిచేస్తున్న పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ ఓపెన్ హౌస్ విక్షించేందుకు నగరంలోని పలు విద్యా సంస్థల నుండి వచ్చిన విద్యార్థులకు పోలీసులు నిర్వహిస్తున్న విధులు, వారు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరు, అలాగే బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ చిన్నారులకు పోలీస్ తుపాకుల పనితీరు ను వివరించారు. ఈ ఓపెన్ హౌస్ కు తరలి వచ్చిన కాలేజీ యువత ప్రధానంగా పోలీస్ జాగిలాలతో అధిక సమయం గడపడం కొస మెరుపుగా నిలిచింది. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ క్షేమం కోసం నిరంతరం శ్రమించేది పోలీసులు మాత్రమేనని, పోలీసులను మీ స్నేహితులుగా భావించాలని, ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను మరువవద్దని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమం డీసీపీ సలీమా, రవీందర్, అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ లు అనంతయ్య, సురేంద్ర,దేవేందర్ రెడ్డి, ఆర్.ఐ లు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్,, సతీష్, ఇన్స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, సతీష్ తో పాటు ఆర్. ఎస్.ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం



-క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు.

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.

హనుమకొండ జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 25, ప్రజా జ్యోతి.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.శుక్రవారం హనుమకొండ జె.ఎన్.ఎస్. స్టేడియంలో అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించవచ్చు అని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలలో, కళాశాలలో క్రీడల్లో రాణించడం వల్ల లాభాలపై బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, అలాగే



స్నేహపూర్వక వాతావరణం క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రెటరీ , డివైఎస్ఓ గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 19 జూనియర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అందులో రేపు నిర్వహించబోయే క్రీడాంశాలు 1. కోకో, 2.టైక్వాండో,3.బాక్సింగ్, 4.చెస్, 5.జిమ్నాస్టిక్స్, 6.హాకీ, 7.వెయిట్ లిఫ్టింగ్, 8.ఆర్చరీ, 9.ఫెన్సింగ్ 10.అథ్లెటిక్స్ మొదలగు క్రీడలు జవహర్లాల్ నెహ్రూ స్టేడియం నందు నిర్వహించ బడునని ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, లేటెస్ట్ బోనఫైడ్, ఎస్.ఎస్.సి మెమో జిరాక్స్ ల పై తప్పనిసరిగా కాలేజ్ ప్రిన్సిపల్ సంతకం చేయించుకొని ఉదయం 8 గంటలకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం నందు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ వరంగల్ డి ఐ ఈ ఓ గోపాల్ రావు డాక్టర్ శ్రీధర్, వెంకట్ రెడ్డి, దస్రు నాయక్, బరపాటి గోపి, సతీష్, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగులో ఉన్న స్కాలర్షిప్ లు విడుదల చేయాలి

-ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా

పరకాల, అక్టోబర్ 25, ప్రజా జ్యోతి

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున పట్టణంలో బస్టాండ్ కూడలి నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం విద్య రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. ఈ



కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, బొజ్జ హేమంత్, ఎండి ఇస్మాయిల్, బొచ్చు ఈశ్వర్, గణేష్, పవన్ కుమార్, అభిషేక్, సాయి తేజ, రాజేష్, సిద్దు , చింటూ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఎస్సీ బాలికల వసతి గృహం.





హనుమకొండ జిల్లా కమలాపూర్ అక్టోబర్ 25, (ప్రజాజ్యోతి) :

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని ఉప్పల్ గ్రామంలో ఎస్సీ బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరిందని దాదాపు 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడం వల్ల చిన్నచిన్న వర్షాలకే గోడల నుండి నీళ్లు కారుతున్నాయని.అలాగే భవనం పై పెచ్చులు ఊడిపడి ఎప్పుడు పడిపోతాయో తెలియని దుస్థితి ఉందని. బాత్రూములకు డోర్లు లేకపోవడంతో ఆడపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ప్రస్తుతం ఈ భవనం ప్రమాదకరంగా ఉండడం వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది కాబట్టి ప్రస్తుతం ఉన్న అధికారులైన విద్యార్థుల సంక్షేమం కోసం విద్యార్థుల అవసరాల దృష్ట్యా వెంటనే విద్యార్థులకు నూతన ఎస్సీ బాలికల వసతిగృహం నిర్మించాలని వారు డిమాండ్ చేశారు..

# గ్రామాలలో చిల్లర కాంటాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

-ఏఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి.

పరకాల, అక్టోబర్ 25, ప్రజా జ్యోతి.



డివిజన్ పరిధిలోని వివిధ గ్రామీణ ప్రాంతాలలో చిల్లర వ్యాపారస్తులు మధ్య దళారులు రైతుల వద్ద ఆనధికారంగా కొనుగోలు చేపడితే కఠిన చర్యలు తప్పవని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఇతర జిల్లాల నుండి వచ్చే చిల్లర వ్యాపారస్తులు ట్రాలీలు,ఎలక్ట్రికల్ కాంటాలతో గ్రామాలు తిరుగుతూ పత్తి కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్ సిబ్బందిని గ్రామాలలో తనిఖీలు చేస్తూ నిర్వహిస్తామన్నారు. స్థానిక మార్కెట్ కు చెందిన అడ్తీదారులు, ఇతర చిల్లర వ్యాపారస్తులు కానీ ఇలాంటి కొనుగోలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు పండించిన పత్తిని మార్కెట్ కు తీసుకువచ్చి తగిన రేటుకి విక్రయించుకోవాలని కోరారు.